
# చీకటి మాటున చిరుదివ్వెలు

- చల్లా రాంబాబు




విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుండి అప్పుడే బయలుదేరింది గోదావరి ఎక్స్‌ప్రెస్. ప్రయాణికులంతా తమ సామాన్లు సర్దుకోవటంలోనే నిమగ్నమై వున్నారు.

'తల్లివి నీవే తండ్రివి నీవే
చల్లగ కరుణించే దైవము నీవే'

పల్లవించిందో స్త్రీగొంతు. పాట కనుగుణంగా మద్దెలనాదంతో వంతపాడుతుందో మగగొంతు ఓ కంపార్ట్‌మెంట్‌లో.

సాహిత్యాన్ని సరిగ ఉచ్చరించలేకపోతున్నా గొంతు కమ్మగానే వుంది లయబద్ధంగా.

''ట్రైనింకా బయలుదేరిందో లేదో అప్పుడే మొదలు. అయినా ఈ బెగ్గర్స్‌నెందుకు అనుమతిస్తారో'' కళ్లద్దాల కుర్రాడి గొణుగుడు.

'అయ్యో పాపం! ఇద్దరూ అంధులే' అనుకుని ధర్మం చేసాడో పెద్దాయన.

నర్సమ్మ, సూరయ్య జన్మతః అంధులైనా, ఇద్దరికి అగ్నిసాక్షిగా పెళ్లి జరక్కపోయినా భార్యాభర్తలనిపించుకున్నారు నిజాయితీగానే. ప్రకృతి రమ్యమైన గుబురుచెట్లే వారి నివాసం. కొమ్మల్లో కువకువలాడే పక్షులతోనే వారి సావాసం. పగలంతా రైళ్లలోను ప్లాట్‌ఫామ్‌మీద గడిచిపోయేది. రాత్రి చెట్టుకింద గడిపి, పొద్దునే పక్షుల కిలకిలా రావాలతో మేల్కొనేవారు.

సాహిత్య సంగీత సంగమం. సుమధుర భావావేశపు విహారం. రాగయుక్తంగా లయబద్ధంగా ఏ గొంతునుండి ఉబికినా అది స్వరసురఝరీ, భావోద్రేకపు సాగరి.

నర్సమ్మ పాటను అడిగి మరీ పాడించుకుని డబ్బులిచ్చేవారూ లేకపోలేదు.


అందరిలానే వారి సంసార నావ సాఫీగానే సాగుతుంది. పొందబోయే మాతృత్వాన్ని తల్చుకుని నర్సమ్మ మనసు ఉప్పొంగుతోంది. కాని పుట్టబోయే బిడ్డకు తమలాంటి ధైర్యస్థితి కలుగుతుందేమోనన్న సంశయం కూడ లేకపోలేదు.

నర్సమ్మ ఆడపిల్లను కంది. ఆమె సంతోషానికవధుల్లేవు. జీవితమే నిరర్థకమనుకుని చావబోయిన తనకు తోటి అంధుడైన సూరయ్య ఆసరాల లభించింది. బ్రతుకు యాత్రలో తోడుగ నిల్చాడు. బ్రతుకు పండించాడు.

చేతులనే కళ్లుగా చేసుకుని పసిబిడ్డ ఒళ్లంతా తడిమి పులకరించిపోయింది నర్సమ్మ. తనిపుడో మాతృమూర్తి. తనలాంటివారికో స్ఫూర్తి. మరోసారి బిడ్డ కళ్లు తడిమింది ఆత్రంగా. కళ్లున్నట్లు తెలిసినా చూపుందో లేదోనని తెలుసుకోవాలన్న తహతహ కొట్టుమిట్టాడుతుంది మనసులో. పురిటిలో సాయం చేసిన సత్తెమ్మ నడిగింది.

''ఒలే సత్తీ! నా కూతురు కళ్లు బాగున్నాయా! ఆ కళ్లకు సూపుందా! అందరిలాగా అదీ లోకాన్ని సూత్తుందా! కళ్లు కలవ రేకుల్లాగున్నాయా! రెప్పలు తుమ్మెద రెక్కల్లాగున్నాయా! సెప్పవే!'' ప్రశ్నలమీద ప్రశ్నలు.

''ఏటే నర్సమ్మా! అలా అయిపోతున్నావ్! పెపంచకంలో నువ్వే పురుడోసుకు



న్నట్టుగున్నాది. గొప్ప ఇసిత్రంలే. అదింకా పుట్టి భూమ్మీద పడ్డాది. నేత్రాలింకా ఇప్పలేదు. దానికి సూపుందో నేదో నాకేటి తెలుస్తాదే. ఓలమ్మా! నేను సూత్తన్నానే, నాకు సూపున్నాదేనని అప్పుడే నీ కూతురు సెప్పేస్తాదీటే! నాల్రోజులాగితే తెలుస్తాది'' అంది సత్తెమ్మ.

సత్తెమ్మకేం తెలుసు ఆ మాతృత్వపు మమకారం. హృదయ రంజితమైన ప్రకృతిని, వింత సొబగుల ప్రపంచాన్ని కళ్లారా కనడానికి వీల్లేకుండా చీకటినే ముద్దగచేసి తన కళ్లల్లో నింపాడా దేవుడు. ఆ పరిస్థితి తన కూతురికి రాకూడదన్న తల్లి మనోవేదననెలా వ్యక్త పరచగలదు.

''అదికాదే సత్తీ! నా కూతురుకు సూపుంటే మాకేటి కావాలే! ఈ పెపంచకాన్నంతా దాని కళ్లెట్టుకుని సూడమూ!''

నర్సమ్మ భయపడ్డట్టు జరగలేదు. కూతురికి చూపుందని తెలిసి తమకే చూపొచ్చినంత సంబరప డ్డారా దంపతులు. కళావతి అన్న పేరు పెట్టి ముద్దుగా పెంచసాగారు.

చిగురుటాకుల్లాంటి కూతురి పాదాలను అరచేతులను తడిమి తన బుగ్గలపై నిమురుకుని తన్మయత్వం చెందేది నర్సమ్మ. పసిదానికి పాలిస్తూ తనూ ఓ మాతృమూర్తినేనని గర్వపడేది. తన మనోడోలికన ఊగించి జోలపాడేది. గుండెలపైనే నిద్రపుచ్చేది. ''అమ్మ'' అన్న కూతురి తొలిపలుకు విన్న నర్సమ్మ హృదయంలో కోటివీణలు మీటినట్టు, కలకోయిలలు కచ్చేరి చేసినట్టనిపించింది. కొసరి కొసరి అనురాగం కలిపిన గోరుముద్దలు తినిపించేది.

సూరయ్య నడుముకు కట్టుకున్న మద్దెలపై కూతుర్ని కూర్చోబెట్టుకుని ఇద్దరూ పాడుతుంటే కళావతి చేతులు చాపి కనిపించిన వారినందరినీ పైసలడుగుతుండేది.

''కుందనపు బొమ్మలాంటి పిల్ల వీళ్లకెలా పుట్టిందో పాపం'' అని ఎందరో ఆశ్చర్యం వ్యక్తంచేసారు.

కూతుర్ని ఎన్నోరకాలుగా ముస్తాబు చేయించేది నర్సమ్మ. పాతబట్టలమ్మే వాళ్లదగ్గర మంచి పరికిణీ జాకెట్టు కొని కూతురికి తొడిగించి ఒళ్లంతా తడిమి పులకాంకితమయ్యేది. కళావతి పెరుగుతున్నకొద్దీ అందం ద్విగుణీకృతం కాసాగింది.

''నర్సమ్మా! నీ కూతుర్ని సూత్తుంటే సిదిమి దీపం ఎట్టుకోవచ్చునే'' అన్న తోటివాళ్ల మాటలకు పొంగిపోయినా, పాపిష్టి కళ్లు పడతాయేమోనని కూతురికి దిష్టి తీసేది. ఆ చెట్టుకిందే తమ సంపాదనతోనే చిన్న గుడిశె నేర్పాటుచేసుకుని కూతురిని తమతో యాచనకు తీసుకుపోకుండా గుడిశెలోనే వుంచి ఎవరినో ఒకర్ని కాపలా వుంచేది.

కూతురికి సంగీతం నేర్పించాలని, పాడుతుంటే విని మురిసిపోవాలన్న నర్సమ్మ కోరికంతకంతకూ బలీయమైంది. కాని బిచ్చగాళ్ల కూతురికి సంగీతం ఎవరు నేర్పుతారు? సంగీతం నేర్చుకోవడానికి ముందు చదువు రావాలని ఎవరో చెపితే మరీ నిరాశకు లోనైంది. అయినా తన ఆశ సడలిపోలేదు. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లారా దంపతులు.

''బాబూ! పంతులు బాబూ! మేం గుడ్డోళ్లం బాబూ! కాని కూతురు మట్టుగ సక్కని సుక్కనాగుంటాది. దానికి సూపుంది బాబూ! దానికి సదువు సెప్తారా బాబూ! మేం అడుక్కుని బతికేటోళ్లం. ఏ వీ ఇచ్చుకోలేం బాబూ!'' అంది.

ఆ స్కూల్ హెడ్‌మాస్టారు ప్రకాశంగారికి సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. అంధులైనా పూట తిండికోసం వెతుకాడే పేదవారైనా కూతుర్ని చదివించాలన్న అభిరుచి అతన్ని పట్టికుదిపింది.

''తప్పకుండా చెప్తామమ్మా! ఇది ప్రభుత్వ పాఠశాల. ఇక్కడ చదువుకునేందుకు మీరేం ఇవ్వనక్కర్లేదు. రేపే మీ అమ్మాయిని ఈ బడిలో చేర్పించండి.''

మాస్టారి మాటలు విని పొంగిపోయారిద్దరూ.

''అలాగే బాబూ! మీ మేలు జనమ జనమలకూ మరిసిపోలేం'' అన్నారు.

సరస్వతీ కటాక్షానికి పేద గొప్ప బేధాలుండవనడానికి నిదర్శనంగా కళావతి అందరికంటే ముందే పాఠాలు టకటకా అప్పజెప్పేది. చదువులో ఆమె ప్రతిభకు ప్రకాశం మాస్టారు ''మట్టిలో మాణిక్యానివే'' అని అభివర్ణించేవారు. ప్రతి తరగతిలోనూ మొదటి స్థానంలోనే వుండేది. కాని ఇవేమీ నర్సమ్మకు అంత గొప్పనిపించలేదు. కూతురు తంబురా మీటినప్పుడే తన మానస వీణ పలుకుతుందని, గళం విప్పి పాడినపుడే మనసు ఆనందడోలలో ఊగుతుందని, తన కోరిక ఈడేరుతుందని భావించి మళ్లీ ప్రకాశం మాస్టారివద్దకు వెళ్లింది.

''పంతులు బాబూ! నా మనసులోని మాట మీగ్గాక ఇంకోరికి సెప్పుకోను. మా కళావతి మీ బడిలో సంగీతం సెప్పుతారా బాబూ! అది నాకన్నా బాగా పాడాల, దాని పాటతో నాలుగుపైసలు అడుక్కోడానిక్కాదు మాబూ! అది పెద్ద ఇద్వాంసురాలైతే పాట ఇని జనాలంతా సప్పట్లు కొట్టాల. సెభాష్ అనిపించుకోవాల. నా పంచదార సిలకను ముద్దెట్టుకోవాల. అదే బాబూ నా గుండెలో ఎప్పుడినుండో కొట్టుకుంటంది.''

మానవుని ఆశకు అవధుల్లేవనడానికి నిదర్శనంగా వుంది నర్సమ్మ కోరిక.

'నీ మనసనే ఆశల కడలిలో ఎన్ని ఆశయాల అలలో' అని మనసులో అనుకుని ''చూడు నర్సమ్మా! ఈ బడిలో చదువు మాత్రమే చెప్తారు. నీవనుకున్నట్టు సంగీతం నేర్పించాలంటే ఇక్కడ కుదరదు. ఇంకెక్కడైనా నేర్పించాలి. దానికి కొంత డబ్బు ఖర్చవుతుంది మరి'' నర్సమ్మ ఆశయాల కాశ్చర్యపడుతూ అన్నారు మాస్టారు.

''బాబ్బాబూ! త వరే పున్నెం కట్టుకోవాల. ఎలాగైనా దానికి సంగీతం సెప్పించండి బాబూ! కూడు తిన కుండా మా కడుపులో కాళ్లెట్టుకొనైనా పైసలు కూడ బెట్టి ఇచ్చుకుంటాం.''


పట్టువదలని విక్రమార్కునిలా వుంది నర్సమ్మ ప్రయత్నం. ''సరేలే నర్సమ్మా! నేను ప్రయత్నం చేస్తాను. నీకంత కోరిగ్గా వుంటే నేనామాత్రం సహాయం చెయ్యలేనా!'' అని అన్నారు మాస్టారు.

నిస్వార్ధంతో నిర్మల హృదయంతో ఏ కార్యక్రమం తలపెట్టినా అవిఘ్నంగా నెరవేరుతుంది. పట్టుదలతో ప్రయత్నిస్తే మట్టిలోనుండి మణులనూ తియ్యొచ్చు.

కళావతిలోని విద్వత్తు విద్యుత్‌లా వెలుగొందింది. ప్రకాశం మాస్టారి ప్రయత్నంతో కళావతి పడ్డ కృషి, సాగించిన సాధన, పేరుకున్న పట్టుదల ఊరికే పోలేదు. సంగీతంలో ప్రావీణ్యం సాధించింది. కచ్చేరీచేసే స్థాయికెదిగిందంటే దానివెనక ఎన్ని ఆకలి రాత్రులు, పస్తుల పగళ్లు గడిచాయో వారికే తెలుసు.

కళావతి పట్టుబట్టి తమ నివాసాన్ని గుడిశ నుండి

## మరో వారసుడు



నిన్నామొన్నటివరకూ అల్లరి చిల్లర చేష్టలతో షూటింగ్‌స్పాట్‌లోని జనాన్ని విసిగిస్తుండిన బాబూమోహన్ ప్రస్తుతం కాస్త హుందాగా ఉంటున్నాడని వినికిడి. తను ఎమ్మెల్యే అయ్యాడు కాబట్టి, ఒక ప్రజా ప్రతినిధిగా కోతి చేష్టలు చేయడం బాగుండదని ఆయన అనుకుని ఉండచ్చు. ఏదేమయినా ఆయన అల్లరిచేష్టలు మానినందుకు అభినందించి తీరాల్సిందే. పోతే- ఎమ్మెల్యే అయ్యాక బాబూమోహన్‌కి సినిమా అవకాశాలు బాగా తగ్గిపోయాయని ఇండస్ట్రీజనం అంటుంటే, తనే కొన్ని అవకాశాలు వదిలేస్తున్నానని ఆయన అంటున్నాడు. ఈ అవకాశాల సంగతి పక్కనెపెడితే బాబూమోహన్‌కి ఓ కోరిక 'తీరని కోరిక'లా మిగిలిపోయి ఉంది. తను హీరోగా మరో సినిమా చెయ్యాలని. కాని ఇక ఆ కోరిక తీరే అవకాశం లేదు కాబట్టి, కనీసం తన కొడుకునయినా 'హీరో' చేయాలని ప్రయత్నాలు మొదలుపెట్టాడు. త్వరలో బాబూమోహన్ వారసుడికి హీరోగా మనం తెరమీద చూడబోతున్నామన్నమాట.

- జె.వి.బాబు

పూరింటికి మార్చింది.

'గుడిశలో చిరుదివ్వె, మబ్బులో మెరుపుజాడ, కళల కాణాచి కళావతి' అని ఆమె గానకౌశలాన్ని గొంతు మాధుర్యాన్ని రాయని పత్రిక లేదు.

''అమ్మా! నన్ను చూడ్డానికి పెద్ద పెద్దవాళ్లొస్తుంటారు. ఈ ఇల్లేమీ బాగాలేదు. ఇంకేదైనా డాబా ఇంటికి మారిపోదామే'' అంది కళావతి. తన మనసులో అపుడే అంతరం అంకురించింది.

''అదే ఒలమ్మీ! అలాగంటావ్! నీగురించి గాదేటే సెట్టుకింద ఉన్నోళ్లం గుడిశలోకి మారినాం. ఆ తరవాత ఈ ఇంటిలోనికొచ్చినాం. మేం అంత పెద్ద పెద్ద ఇళ్లల్లో ఇవరలే వే! మావి సిన్న పేనాలు. అంత పెద్దింటి కాడ నుండి జోలెట్టుకుని అడుక్కోడానికి వెళ్లగల వేటే!'' అంది నర్సమ్మ.

''నేనుండగా మీరడుక్కోవడమేమిటమ్మా! ఆ పని మానేయమని నేనెప్పుడో చెప్పాను. పదిమందిలో నాకు చిన్నతనంగా వుండదూ! కాస్తో కూస్తో సంపాదిస్తున్నాగా! అయినా మొన్న మనింటికొచ్చిన రవిగారు– 'వీళ్లు ట్రైన్‌లో పాడుకుంటూ అడుక్కుంటే చూశాను, వీళ్లా మీ తల్లిదండ్రులు' అని అన్నారు. ఆ మాటకు నా తల తీసేసినట్లైంది. అతనికి నేనంటే, నా సంగీతమంటే పిచ్చి అభిమానం. నాకు మంచి మంచి అవకాశాలొస్తున్నాయంటే అతనివల్లే. బాగా ఉన్నవాడు కూడానూ. అతనికో మంచి ఇల్లుందట. అక్కడకు వచ్చేయమన్నాడు. వెళ్లిపోదామే అమ్మా!''

గుండెలో కట్టుకున్న గూడు చెదిరిపోయినట్టు, ఆరవ ప్రాణం ఆరిపోయినట్టు, ఆశయాల సౌధం కూలిపోయినట్టనిపించింది నర్సమ్మకు.

''సత్తి వైన మాట సెప్పినావమ్మీ! గొప్పోళ్లతో గొప్పోళ్లే నేత్తం కట్టాల. సిలకను పెంచుకుంటారుగాని కాకినెవ్వరైనా పెంచుకుంటారే! మా మానాన్న మమ్మల్ని బతకనియ్యమ్మీ! మావి బురదగుంట జీవితాలు, కుళ్లిపోయి ఎండిపోవడమేనమ్మీ! నువ్వు సల్లగుండడమే మాక్కావాలమ్మీ! మాకు గేనం వచ్చిన కాడినుండి అడుక్కోవడం తప్ప ఇంకేటీ తెల్దు. అదిప్పుడొదిలెయ్యమంటే ఏలాగోలమ్మీ! కాని ఒకటి సెప్తానినుకోయే! మాకు సూపు నేకపోయినా తడుముకోనైనా జాగర్తగా అడుగు ముందుకేసుకుని నడుస్తుంటాం. నీకు సూపున్నాది. ఎత్తుపల్లాలు సూసుకొని జాగర్తగా అడుగేసుకొని నడుసుకోలమ్మీ! అయినా మేం నీకాడుంటే నువ్వు అందరిలో తేలికైపోతావు. పదిమందికాడ నీ పరువు పోద్ది.''

నర్సమ్మ హృదయం నుండి దుఃఖం ఉబుకుతున్నా, చూపులేని కళ్లనుండి కన్నీరు రాలడానికి ప్రయత్నిస్తున్నా బలవంతాన ఆపుకుంది.

''నన్ను కని పెంచి పెద్దచేసి, సంగీతం నేర్పించారు. కాదనను. కాని మంచి భవిష్యత్తుని కోరుకోవడం తప్పు లేదు కదమ్మా! అందుకే నేనో నిర్ణయానికొచ్చాను. మీరు నాతో వస్తే సరి. లేదంటే నేను ఒంటరిగానైనా రవిగారి వేరే ఇంట్లో వుంటాను. అపుడపుడు మిమ్మల్ని చూడ్డానికి వస్తుంటాను'' తన నిర్ణయాన్ని రెండుముక్కల్లో చెప్పింది కళావతి.

''సానా మంచిదమ్మీ! నీకా దేవుడు మేలు సెయ్యాలి. మొన్న గాలోనకి మా గుడిశ ఎగిరిపోకుండా వుంటే మల్లా అందులోనికెళ్లిపోతాం'' అంది నర్సమ్మ.

ఈసారి కళావతి మౌనంగా వుండిపోయింది. ఇక్కడ మౌనం పూర్తి అంగీకారం కిందే తీసుకుని ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు.

చరిత్ర పునరావృతమైంది. నర్సమ్మ, సూరయ్య పాటలు రైళ్లల్లో వినబడుతూనే వున్నాయి. నర్సమ్మ గొంతులో మాధుర్యం కొంత తగ్గినా కూతురు గొంతు కోయిలలా పలుకుతుందని గొప్ప పేరు తెచ్చుకుందని ఇంకా మురిసిపోతూనే వుందా మాతృమూర్తి.

''ఏం నర్సమ్మా, సూరయ్యా! బాగున్నారా?''

ట్రైనెక్కడానికి ప్లాట్‌ఫాంపై నిల్చున్న ప్రకాశం మాస్టారి గొంతు గుర్తుపట్టిన నర్సమ్మ–

''పంతులు బాబుగారా!'' అంది.

''అవును నేనే''

''మీ దయవల్ల బాగున్నాం బాబూ'' ఇద్దరూ ఒకే సారి అన్నారు.

''కళావతి నమ్ముకున్న ఆ రవి తన ఖర్మానికి తన్నొదిలేసి విదేశాలకు ఉద్యోగానికని వెళ్లిపోయాడట. ఈ ఊరిలో మొహం చెల్లక కళావతి హైదరాబాద్ వెళ్లిపోయిందట. మీకే వన్నా తెలిసిందా?''

''మాకేటి తెలుత్తాది బాబూ! మా సంబంధమెప్పుడో తెంచేసుకున్నాది గదా! ఆ ఇసయం మీకు తెల్దేటి బాబూ! అదేడున్నా సల్లగుండాల.''

పేగు తెంచుకుపోయిన కూతుర్ని ఇంకా ప్రేమిస్తూనే వుందా తల్లి.


''సరే ట్రైనొస్తుంది. నే వెళ్తాను'' అన్నారు మాస్టారు.

''మంచిది బాబూ!''

• • •

అవకాశాలు రావడంతో కళావతి హైదరాబాద్‌లో ఇంకా మంచి పేరు తెచ్చుకుంది. స్నేహపరిధులు పెరిగాయి. సభలు, సన్మానాలు, ప్రశంసలు, బిరుదులు– ఒకటేమిటి– సంగీత సామ్రాజ్ఞికి కళావతి ఓ కలికితురాయి.

ఆరోహణావరోహణలు ప్రతి వ్యక్తికి సర్వసామాన్యం. 'ప్రముఖ గాయనీమణి కళావతి గొంతు కారు ప్రమాదంలో శాశ్వతంగా మూగబోయింది' అన్న వార్త అన్ని పత్రికల్లోనూ అచ్చయింది. సంగీత ప్రియులంతా ''పాపం'' అన్నారు. కాలగర్భంలో కలిసిపోయిన



సంఘటనల్లా ఈ వార్త కూడ మరుగైంది.

గగనాన్ని నమ్ముకున్న తారలెప్పుడూ ప్రకాశిస్తూనే వుంటాయి. భూమిని వదిలి నింగికెగయాలనే మతాబాల తారాజువ్వలు. ప్రకాశవంతంగా వెలిగినా మధ్యలోనే రాలిపోతాయి. ఇవి జగమెరిగిన సత్యం. జరుగుతుంది అనునిత్యం.

కళానిధి కళావతి ఇపుడో మూగబోయిన వీణ. మరపురాని మనోవేదన. శృతిలేని కీర్తన. మౌనరాగాలాపన.

జీవితాంతం తోడుంటానని జీవన నౌకకు చుక్కానవుతానని జీవితంలో ప్రవేశించిన రవి కాటేసి కనుమరుగయ్యాడు. తల్లిదండ్రుల దగ్గరికెళ్లే సాహసం చెయ్యలేక ఒంటరిగానే మిగిలింది, మౌనవేదనతో మూగ జీవితాన్ని వెళ్లదీస్తూ కళావతి.

• • •

పదేళ్లు కాలగర్భంలో కలిసిపోయాయి. కళావతికి గానకళపట్ల మక్కువ తగ్గలేదు. కాని పలుకులొలకని గొంతు తనకు శాపం అయ్యింది. ఇంకెవరికైనా సంగీతం నేర్పించి కళామతల్లికి సేవ చెయ్యాలన్న పట్టుదల పెరిగింది. అప్పటికే కొంత చదువు నేర్పించిన కావేరికి సంగీతం నేర్పించడాని కుపక్రమించింది. సంగీతం మాస్టారినింటికి రప్పించి స్వరగతుల నారంభింపజేసింది.

కావేరి స్వరాలు దాటి కీర్తనల నాలపిస్తే కళావతి మనసు ఆనందంతో పొంగిపోయింది. కావేరి కళావతిని మించిపోయింది గానంతో.

కళావతి మళ్లీ వార్తల్లోకెక్కింది. 'ఒకప్పటి గానసరస్వతి కళానిధి కళావతి ప్రేరణతో, ఆదరణతో మరో సంగీత సామ్రాజ్ఞి' అన్ని వార్తాపత్రికలూ ప్రశంసించాయి.

సానపెట్టిన వజ్రంలా తయారైంది కావేరి. పదహారేళ్ల ప్రాయంలోనే ఎన్నోరాగాలు, కీర్తనలు ఔపోసన పట్టింది. ఎన్నో అభినందన సత్కార పురస్కారాలు సాధించుకున్న కావేరి మనసులో ఏదో వెలితి వుండనే వుంది.

• • •

ఆరోజు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కావేరికి గానకచ్చేరి అనంతరం 'స్వరమాధురి' బిరుదు ప్రదానం చెయ్యడానికుపక్రమించారు, నిర్వాహకులు. కావేరి మైక్ ముందు నిల్చుని-

''సభాసదులకు, కళాభిమానులకు, శ్రోతలకు, నిర్వాహకులకు నా కళాంజలి. సన్మానానికి ముందే నేను కొన్ని మాటలాడడానికి అనుమతించవలసిందిగా కోరుచున్నాను'' అంది కావేరి. ఆమె హృదయం ఉద్విగ్నంగా మారి ఏదో పైకి చెప్పాలని పెల్లుబుకుతుంది వరద కావేరిలా.

''ఈ సన్మానం, బిరుదు ప్రదానం జరగవలిసింది నిజంగా నాక్కాదు''

అది విన్న కళావతి హృదయం మరోసారి పొంగిపొరలింది. తనగురించే చెప్పబోతుందనుకున్న అంచనా తల్లకిందులైంది.

''నిరక్షరాశ్యులైనా సంస్కారమున్న కళా హృదయులు, త్యాగమూర్తులు, చీకటి బ్రతుకుల్ని గడిపిన అంధులైన మా అమ్మమ్మకు, తాతయ్యకు జరగాలీ సన్మానం. యాచనే జీవితంగా సాగించే వారి మనసులు కళాపూర్ణాలు. జన్మతః అంధులైనా కూతురి కళ్లతో లోకాన్ని చూడాలనుకున్న కరుణా సముద్రులు. వారిలో దాగివున్న కళాతృష్ణ వారి కుమార్తెను ప్రముఖ గాయనీమణిగా చేసింది. ఆమెయే మీముందున్న కళావతిగారు. ఆమెకు నా అభివందనాలు. ఎందుకంటే, నేనామె కూతురునని తెలియకపోయినా ఆశ్రయం కల్పించి నన్నో గాయనిగా చేశారు. పేరుప్రతిష్టలకు భంగం కలుగుతుందని, పురుష వంచనకు గురైన ఆమె నాకు జన్మనిచ్చి, అనాధ శరణాలయానికి అప్పగించారు. ఆ విషయం తెలుసుకున్న మా అమ్మమ్మ నన్ను తన కూతురులానే పెంచింది. కన్న ప్రేమ కాదనుకుని హైదరాబాద్ వచ్చినా, తన కూతురిపై అభిమానాన్ని తెంచుకోలేక, ఆమె గానం విని మురిసిపోవాలని నన్ను తీసికొని హైదరాబాద్ వచ్చారా అంధ దంపతులు. కాని కూతురు దైన్యస్థితిని తెలుసుకుని, కన్న మమకారం తెంచుకోలేక, ఆమెను పనిపిల్లగా నన్ను నియమించారు రహస్యంగా.

కావేరి కళ్లనుండి జాలువారుతున్న కన్నీటినొకసారి తుడుచుకుంది.

శ్రోతల్లో సభికుల్లో కలకలం బయలుదేరింది. కావేరి మళ్లీ చెప్పనారంభించింది.

ఆ కరుణామూర్తులు తాము నీరుపోసి పెంచిన మొక్క పుష్పిస్తుంటే చూడలేకపోయినా విని ఆనందించారు.

శ్రోతల్లో ప్రకాశం మాస్టారి ప్రక్కన కూర్చున్న ముసలి దంపతుల గుండె బరువెక్కింది. తమ జన్మ ధన్యమైందనుకున్నారు.

''వారిని వేదిక మీదికి తీసుకు రావలసినదిగా ప్రకాశం మాస్టారిగారిని కోరుతున్నాను'' అంది కావేరి శ్రోతలలో ఒకమూలకు దృష్టిసారించి.

నర్సమ్మ, సూరయ్యలను లేపబోయిన ప్రకాశం మాస్టారి గుండె ఆగినంత పనైంది. అప్పటికే ఈ ఆనందాన్ని పట్టలేని వారి గుండెలాగిపోయాయి. చీకటి మాటున చిరుదివ్వెలారిపోయాయి.

★

## ఇంటర్వ్యూ



ఛానల్ టి.వి. లో సినీతారని ఇంటర్వ్యూ చేస్తున్నాడు-

''మీ వయసెంత?''

''జస్ట్ సిక్స్‌టీన్.''

''పదహారేళ్ళకే ముప్ఫయ్యేళ్ళ దానిలా కనిపిస్తున్నారు.'' చురక అంటించాడు.

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు (సికింద్రాబాద్)

## అలవాటు

''మాటిమాటికి ఇలా 'టీ'లు త్రాగుతే... ఆ తర్వాత అదే అలవాటుగా మారుతుంది.'' అన్నాడు స్నేహితుడు.

''ఆ! సింగినాదం జీలకర్ర... నేను పదిహేను సంవత్సరాలుగా త్రాగుతూ వస్తున్నాను. అలవాటైందా... పాడా!!''

- పి.వి. భైరవన్ (రాజంపేట్)

## లోను

''సార్... నేను నిరుద్యోగిని కనీసం యాభైవేలు లోనిస్తే ఏదో చిన్న వ్యాపారం పెట్టుకుని జీవిస్తాను.'' ప్రాధేయపడుతూ అడిగాడు వెంకటాద్రి, బాంకు మేనేజర్ని.

''నీ లోను ఓకే... కానీ.. నా అమ్యామ్యాకి ఐదు వేలు అవుతుంది మరి.''

''అలాగే సార్... అది కూడా లోనిప్పించండి.''

- లకనం మూర్తి (కాకినాడ)

